# అడుగడుగునా నీరాజనాలు

**కూకట్‌పల్లిలో కేటీఆర్ రోడ్డు షోకు.. బ్రహ్మరథం పట్టిన ప్రజలు**



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు



కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ చేపట్టిన రోడ్డు షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్ చౌరస్తాలో ప్రారంభమైన రోడ్డు షో వివేకానందనగర్, ఖుబా మసీదు, జేకే హోటల్ చౌరస్తా, హాజీమస్తాన్ చౌరస్తా పంకా, మోతీనగర్, మూసాపేట, కైత్లాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, కాలనీ టెంపుల్ బస్టాప్, కూకట్‌పల్లి, బాలానగర్ శోభనా చౌరస్తా వరకు సాగింది. పర్వత్‌నగర్ చౌరస్తాలో మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌లు ఘన స్వాగతం పలికారు. 2వేల బైక్‌లతో ప్రాంభమైన రోడ్డు షోలో అడుగడుగునా జననీరాజనాలు పలికారు. మూసాపేట, కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్ చౌరస్తాలో కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్లు సబీహాగౌసుద్దీన్, పగుడాల శిరీషాబాబూరావు, మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, ముద్దం నర్సింహయాదవ్, మహేశ్వరీశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబూరావు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

- అల్లాపూర్ వివేకానందనగర్ చౌరస్తాలో మహిళలు బోనాలు, బతుకమ్మలు, కోలాటంతో కేటీఆర్‌కు స్వాగతం పలికారు.
- జేకే హోటల్ చౌరస్తాలో కేటీఆర్ ఉర్దూలో చేసిన ప్రసంగానికి ముస్లిం సోదరులంతా జేజేలు పలుకుతూ జై కేసీఆర్.. జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు.
- తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ కొండల్ రెడ్డితో పాటు ఎలక్ట్రికల్ వర్కర్స్ బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతును ప్రకటించారు.
- మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే కృష్ణారావులకు ఇమామే జామిన్ కట్టి ఆశీర్వదించారు. ప్రత్యేక క్రేన్‌తో భారీ గజమాలను వేశారు.
- మూసాపేటలో మహిళలు బోనాలు, బతుకమ్మలు, కోలాటంతో స్వాగతం పలుకగా యువకులు బైక్ ర్యాలీతో సందడి చేశారు.
- కేపీహెచ్‌బీ కాలనీలో కేటీఆర్‌ను చూసేందుకు ప్రసంగాన్ని వినేందుకు భారీగా జనాలు తరలివచ్చారు.
- కేటీఆర్ పంచ్ డైలాగ్‌లకు యువకులు కేరింతలు కొడుతూ జై కేసీఆర్.. జై బీఆర్ఎస్..జై కృష్ణారావు అనే నినాదాలతో హోరెత్తించారు.
- బాలానగర్ చౌరస్తాలో కోలాటం, బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు.
- టీఆర్ రోడ్డు షోలో కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, నర్సింహయాదవ్, సతీశ్‌గౌడ్‌లు బీఆర్ఎస్ మహిళా నేతలతో కలిసి బతుకమ్మ ఆటలాడుతూ సందడి చేశారు.



## కాంగ్రెస్, జనసేన నేతల మాయమాటలు నమ్మొద్దు..

- **అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయండి**
- **ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16 : ఎన్నికలప్పుడే కనిపించే కాంగ్రెస్, జనసేన నేతల మాయమాటలు నమ్మొద్దని, పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటెయ్యాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి, ఫతేనగర్, మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలో వివిధ కుల సంఘాలు, కాలనీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశాలలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని.. అభివృద్ధితో పాటు పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్, తాగునీరు, ముంపు సమస్యలను పరిష్కరించానని, రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేశానన్నారు. వేరే ప్రాంతాల్లో నివసించే నేతలు ఎన్నికలప్పుడే కండువాలు కప్పుకుని వస్తారని మళ్లీ వారు కనిపించరన్నారు.



కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, దళితబంధు లాంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నారని జాతీయ పార్టీలు రాష్ట్రానికోపాలసీ ఉంటుందానని ప్రశ్నించారు. ఇక్కడ చేస్తామని చెబుతున్న పనులన్నీ కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు చేయడం లేదన్నారు. ఆ పార్టీలు గెలిచేది లేదని మళ్లీ బీఆర్ఎస్‌పార్టీనే ప్రజలు ఆదరిస్తారని సీఎంగా కేసీఆర్ మూడోసారి బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాబేగం, బీఆర్ఎస్ పార్టీ నేతలున్నారు.

## కూకట్‌పల్లికి వరాలజల్లు

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు కూకట్‌పల్లికి వరాలజల్లు కురిపించారు.

- కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్‌లో సర్వే నం.18లో గురుకుల మైనార్టీ పాఠశాలను ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు.
- సున్నంచెరువు, మైసమ్మచెరువు, కామునిచెరువులను సుందరీకరించే పనులను వేగవంతం చేస్తానని తెలిపారు.
- హైదరాబాద్‌లో నివసిస్తున్న పేదల కోసం మరో లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లను నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.
- హైదరాబాద్‌లో ప్రతిరోజూ తాగునీరు.. భవిష్యత్‌లో 24 గంటల తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు.
- తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలందరికీ అన్నపూర్ణ పథకంతో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు.
- పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ బీమా.. ప్రతి ఒక్కరికీ ధీమాలో రూ.5 లక్షల జీవితబీమా అందించనున్నట్లు తెలిపారు.
- ప్రతి కుటుంబానికి రూ.400లకు గ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు తెలిపారు.
- సౌభాగ్యలక్ష్మితో పేద మహిళలు రూ.3వేల పింఛన్ అందించనున్నట్లు తెలిపారు.
- ఆసరా పింఛన్‌ను రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంచుతున్నట్లు హామీనిచ్చారు.
- అసైండ్ భూములకు సర్వహక్కులు కల్పించనున్నట్లు తెలిపారు.



## మాధవరం కృష్ణారావు గెలుపు ఖాయం..



బేగంపేట్ మయూరిమార్గ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి





వివేకానందనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

బేగంపేట నవంబర్16: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాదవరం కృష్ణారావును అధిక మెజార్టీతో గెలిపించాలని బేగంపేట్ కార్పొరేటర్ టి మహేశ్వరి ఓటర్లను కోరారు. గురువారం బేగంపేటలోని ప్రకాశ్‌నగర్, అల్లంతోట బావి, మయూరిమార్గ్ బస్తీలలో ఆమె స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి మాదవరం కృష్ణారావుకు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ పథకాలను వారు ఇంటింటికి వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి. సురేశ్‌యాదవ్, నరేశ్, సీ సత్యనారాయణతో పాటు మహిళ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం..**

అల్లాపూర్,నవంబర్16: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు గెలపుకోసం గురువారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ సబీహాబేగం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిదేండ్లలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూలో చేసిన అభివృద్ధి వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థించారు

## రాష్ట్ర క్యారమ్స్ టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్ర సీనియర్ క్యారమ్స్ టోర్నీకి గురువారం తెర లేచింది. కూకట్‌పల్లిలోని రాజునగర్ కాలనీ వేదికగా ఈ నెల 19వ తేదీ వరకు జరుగనున్న టోర్నీని సుబ్రహ్మణ్య రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్యారమ్స్ చాంప్ శ్రీనివాస్, రవిందర్‌గౌడ్, రాష్ట్ర క్యారమ్స్ ప్రధాన కార్యదర్శి మదన్‌రాజు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.